సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం ၊ 15 ၊ డిసెంబర్ ၊ 2023



పంట నష్టం సర్వే

తుపాను కారణంగా వాటిల్లిన పంట నష్టం అంచనా ముమ్మరంగా జరుగుతోంది. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో 50 శాతం మేర సర్వే పూర్తి చేశాయి. 10లో ▸



పుణ్యప్రదం.. ధనుర్మాసం

ధనుర్మాసోత్సవాలకు వైష్ణవాలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ మాసంలో విష్ణు ఆలయాలు, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. 10లో ▸



అంజన్నను దర్శించుకున్న డీఐజీ

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని డీఐజి అశోక్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

30 నుంచి బాలోత్సవం



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని శ్రీచింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్లో ఈ నెల 30, 31 తేదీల్లో బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. గురువారం బాలోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతకు వెలికి తీసేందుకు బాలోత్సవం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. యుటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ పట్టణంలో నిర్వహిస్తున్న బాలోత్సవంలో భీమవరం మండలం, టౌన్, వీరవాసరం, పాలకోడేరు, కాళ్ళ, ఉండి మండలాల పరిధిలోని ఎల్‌కేజీ నుంచి టెన్త్ వరకు విద్యార్థులు పాల్గొనడానికి అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీ లోపు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత



భీమవరంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం: ఇంధనం ఆదా చేయడం ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని తప్పనిసరిగా ఆదాచేయాలని జాయింటు కలెక్టరు ఎస్.రామసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ప్రకాశం చౌక్ సెంటర్‌లో విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 20 వరకు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు జరగనున్నాయని ఈ ఉత్సవాల్లో విద్యార్థులు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజల్లో ఇంధన పొదుపు అవశ్యకతను వివరించాలన్నారు. కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో కె శ్రీనివాసులురాజు, విద్యుత్‌శాఖ ఇఇ పీర్ అహ్మద్ ఖాన్, ఈఈలు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో సాగాలి



పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీమన్నారాయణరెడ్డి

భీమవరం: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తే అనేక విజయాలు సాధించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి బి.శ్రీమన్నారాయణ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు గురువారం భీమవరం డీఎన్నార్ కళాశాల రామకృష్ణ సభా భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని దీనిలో భాగంగా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి నిర్వహించిన క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు తమ కళాశాలలో కంప్యూటర్ శిక్షణ ఇవ్వడానికి తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. విజేతలైన 123 మందికి బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వాకడ మణి, డాక్టర్ యువీ రమణరాజు, పి.రామకృష్ణంరాజు, ఎం.కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ బి.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా 17 నుంచి సచివాలయం వద్ద రేషన్

ఏలూరు(మెట్రో): రేషన్ తీసుకోని కార్డుదారుల సౌకర్యార్థం ప్రతి నెల 17న మధాహ్నం నుంచి రేషన్ వాహనాన్ని సంబంధిత సచివాలయం వద్ద ఉంచుతారని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రేషన్ పంపిణీ విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయవచ్చునన్నారు. డిసెంబర్ నెలకు సంబంధించి రేషన్ తీసుకోని వారు 17న మధ్యాహ్నం నుంచి సచివాలయం వద్ద సరుకులు పొందవచ్చన్నారు.

డీసీఎంఎస్.. ఆదాయం భేష్

- ఒక పక్క రైతులకు సేవలు
- మరోపక్క అదనపు ఆదాయం దిశగా అడుగులు
- గత రెండున్నరేళ్లలో రూ.2.08 కోట్ల అదనపు ఆదాయం



ఏలూరులో ఆధునికీకరించిన డీసీఎంఎస్ కల్యాణ మండపం



భీమవరంలో బాణసంచా విక్రయాలు ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ మోషేన్ రాజు(ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో డీసీఎంఎస్ (జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) అభివృద్ధి పథంలో నడుస్తుంది. ఒక పక్క రైతులకు సేవలు అందిస్తునే మరో పక్క అదనపు ఆదాయంలో సంపాదించడంలో కూడా విజయవంతంగా ముందుకు సాగుతుంది. గత ప్రభుత్వంలో డీసీఎంఎస్ కేవలం రైతులకు సేవలు అందించడం మాత్రమే చేసేది. దీంతో సంస్థ అభివృద్ధి అంతంతమాత్రంగా ఉండేది. ఈ ప్రభుత్వం వచ్చాక డీసీఎంఎస్ అభివృద్ధి వేగంగా జరుగుతోంది. అదనపు ఆదాయంతో పాటు రైతుకు సేవలందిస్తూ రాష్ట్రంలోనే ఉత్తమ డీసీఎంఎస్‌గా నిలిచింది.

మరింత ఆదాయం వచ్చేలా : డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి ప్రభుత్వం సహకారంతో సంస్థ ఆదాయం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి డీసీఎంఎస్ ద్వారా రైతులకు సేవలు అందించడంతో పాటు అదనపు ఆదాయంపై దృష్టిపెట్టారు. సంస్థకు ఉన్న వసతులను ఉపయోగించుకుని ఆదాయం తీసుకురావాలని భావించి ఆ దిశగా అడుగులు వేశారు. కేవలం రెండేన్నర ఏళ్లల్లో సంస్థకు రూ 2.08 కోట్ల ఆదాయం తీసుకొచ్చారు. ఏలూరులోని నిరూపయోగం ఉన్న మెయిన్ బ్రాంచ్ షెడ్డును రూ.90 లక్షలతో ఆధునికీకరించి, సౌకర్యవంతమైన కల్యాణ మండపం చేశారు. భీమవరంలో సామాన్య ప్రజలకు మందులు ధరలు అందుబాటులో ఉండాలని, డీసీఎంఎస్ జనరిక్ మందుల షాపు ఏర్పాటు చేశారు. భీమవరంలో దీపావళీ బాణసంచా దుకాణం ఏర్పాటు చేసి మంచి ఆదాయం వచ్చేలా చేశారు. పొగాకు బోర్డు, రైతులకు మధ్య కమిషన్ పద్ధతిపై డీసీఎంఎస్ ద్వారా సేవలు అందించి ఆదాయం తీసుకువచ్చారు. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల సంఖ్య 20 వరకు పెంచి మరింత ఆదాయం వచ్చేలా చేశారు.

రెండున్నరేళ్లలో రూ. 2.08 కోట్ల ఆదాయం

ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ గత రెండున్నరేళ్లలో రూ. 2.08 కోట్ల ఆదాయం అందుకుంది. ఈ రెండున్నరేళ్లలో ఆయా మార్గాల ద్వారా వచ్చిన ఆదాయం వివరాలు

- కల్యాణ మండపం ద్వారా రూ.50 లక్షలు
- బాణసంచా ద్వారా రూ.15 లక్షలు
- పొగాకు బోర్డు రూ.25 లక్షలు
- ధాన్యం కొనుగోళ్ల రూ.కోటి
- జనరిక్ మందుల షాపు ద్వారా రూ.18 లక్షలు ఆర్జించారు.

మరో రెండు మార్గాల ద్వారా

ఏలూరు సెంట్రల్ ఆఫీసు గ్రౌండ్ ఫ్లోర్లు 6 వేల చదరపు అడుగుల ఉన్న ప్రాంతాన్ని ఆధునికీకరించి అద్దెకు ఇచ్చి ఏడాదికి రూ.36 లక్షల ఆదాయం తీసుకురావాలని, నిడదవోలులో షెడ్డులను షాపులుగా మార్చి వాటి ద్వారా సంస్థకు ఆదాయం తీసుకురావడానికి చైర్మన్ చర్యలు తీసుకున్నారు.

సంస్థ ఆదాయం పెంచడమే లక్ష్యం



డీసీఎంఎస్ సంస్థకు ఉన్న వనరులను ఉపయోగించుకుని ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల, అధికారుల సహకారంతో సంస్థను అభివృద్ధి చేసి రెండేన్నర ఏళ్లల్లో మంచి ఆదాయం తీసుకొచ్చాం. ఒక పక్క రైతులకు సేవలు అందించడంతో పాటు సంస్థ ఆదాయం కూడా పెంచుతున్నాం. జనరిక్ మందులు షాపులు, ఇతర సౌకర్యాలు కల్పించేలా డీసీఎంఎస్ ఉపయోగపడుతుంది.

– వేంద్ర వెంకటస్వామి, డీసీఎంఎస్ చైర్మన్

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం



మేడిది జాన్సన్

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన మేడిది జాన్సన్‌ను పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన జీజీ బెన్నర్‌ను అధికార ప్రతినిధిగా, బీ డేవిడ్‌రాజును జాయింట్ సెక్రటరీగా నియమించారు. రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీగా బలం సత్యనారాయణను, రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీగా మానేపల్లి శేఖర్, రాష్ట్ర వీవర్స్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా బళ్ళా పరమేశ్వరరావును, సెక్రటరీలుగా వీర మల్లిఖార్జునరావు, సిద్దాని సాంబశివరావు, జాయింట్ సెక్రటరీగా తల్లా తాతారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడిగా అంబికా రాజా, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ సెక్రటరీగా ఏలూరు జిల్లాకు చెందిన కే ఏలియా, రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీగా షేక్ యూనీస్ పాషా, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ హమీద్, రాష్ట్ర రైతు విభాగం సెక్రటరీగా చేబోయిన వీర్రాజు, జాయింట్ సెక్రటరీగా కే.ప్రసాదరెడ్డి, రాష్ట్ర వీవర్స్ వింగ్ సెక్రటరీలుగా తాటకుంట్ల రవి, గోలి చంద్రశేఖర్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సభ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి భీమవరం పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఎలాంటి పొరపాట్లు జరగకుండా పగడ్బందీగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి భీమవరం పర్యటన నేపథ్యంలో గురువారం సాయంత్రం స్థానిక బైపాస్ రోడ్ లోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియరు కాలేజీ వెనుక లేవుట్‌లోని సభా ప్రాంతాన్ని, లూథరన్ హైస్కూల్ గ్రౌండ్ హెలిప్యాడ్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవి ప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డితో కలసి గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు. సభాస్థలి సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభాస్థలి డయాస్, ముఖ్యమంత్రి బస్, కాన్వాయ్, మంత్రులు, శాసన సభ్యుల వాహనాల పార్కింగ్, తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి విద్యాదీవెన కార్యక్రమం భీమవరంలో జరుగుతుందని తెలిపారు. పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడ లోటు పాట్లు జరగకుండా అధికారులు సమన్వయంతో, సమర్థవంతంగా పని చేయాలన్నారు. సభాస్థలిలో హైడ్రోజన్ బెలూన్ ఏర్పాటు చేయాలని, అందరికీ సభా ప్రాంతం తెలుస్తుందని సూచించారు. ఎక్కడ కార్యక్రమంలో ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, ఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్, జిల్లా ఆర్ అండ్ బీ అధికారి బి.లోకేశ్వరరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి డా.ఆర్వీ ఆనంద కుమార్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక దళ అధికారి బి.శ్రీనివాసరావు, సర్వే అధికారి కె.జాషువా, డీఎస్పీ బి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం

మంత్రి జోగి రమేష్



రామన్నపాలెంలో రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో చీఫ్ విప్ ముదునూరి

మొగల్తూరు: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని రామన్నపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు చీఫ్ విప్ ప్రసాదరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఆయన ముందుగా గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి రూ.1.15 కోట్లతో నిర్మించిన రహదారిని, నరసాపురం మండలంలోని పీతానివారిమెరక, వైఎస్ పాలెం మీదుగా సీతారాంపురం వరకు రూ.2.20 కోట్లతో నిర్మించిన రహదారిని గ్రామంలోని రెండో సచివాలయ పరిధిలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్‌ఆర్ ఆరోగ్య కేంద్రాన్ని, పులపర్తివారితోట నుంచి పసలదీవి వరకూ రూ.2.88 కోట్లతో నిర్మించిన రహదారిని, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత ప్రసాదరాజుకే చెందుతుందన్నారు. రామన్నపాలెంలో రూ.70 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేయడం, నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించిన ఘనత ప్రసాదరాజుకే చెందుతుందన్నారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి దూరదృష్టి, ముందు చూపుతో గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటరీ వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రాలకు స్థలదాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందెల ఎలీషా, ఆర్డీవో అంబరీష్, ఎంపీపీ అందే సూర్యావతి, జెడ్పీటీసీ తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మీ, నాయకులు కర్రి ఏసుబాబు, అనంత సుబ్రహ్మణ్యం, కట్టా మూర్తి, కొల్లాబత్తుల రవికుమార్, కట్టా మస్తాన్, మేకల పరశురామ్, కుక్కల మోహనరావు, యాతం చంటి, అయితం బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ప్రచారం చేయాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పి.ప్రశాంతి రానున్న ఎన్నికలలో వివిధ కార్యకలాపాలకు సంబంధించి నియమించిన నోడల్ అధికారులతో సమావేశమై వారు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నియోగించినేందుకు వివిధ ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. సక్రమంగా ఓటు వినియోగించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఈవీఎంల మీద సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ద్వారా ఓటు హక్కు వినియోగంపై వివరించారు. ఓటు హక్కు పొందడం, వినియోగించుకోవడంపై అవగహన పెంచుకోవడంతో పాటు మిగిలిన వారిలో కూడా అవగహన, చైతన్యం కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి, డిఆర్ఓ శ్రీమన్నారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన 22 మంది ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల సూపరింటెండెంట్ దుర్గా కిషోర్, డీటీ ఎం.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'కు సర్వం సిద్ధం

- 223 ఆట స్థలాల ఎంపిక
- 1.72 లక్షల మంది క్రీడాకారుల రిజిస్ట్రేషన్
- 230 మంది పీఈటీ, పీడీల నియామకం



ఆడుదాం ఆంధ్ర కిట్లు

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరానికి జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయిదు కేటగిరిల్లో నిర్వహించే ఆటల పోటీలకు ఇంతవరకు సుమారు 1.72 లక్షల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్రీడల నిర్వహణకు జిల్లాలోని 20 మండలాల పరిధిలో 223 ఆటస్థలాలను గుర్తించారు. మానసిక ఉల్లాసంతోపాటు వ్యాయామం ద్వారా మనిషి ఆరోగ్యానికి భరోసా ఇచ్చే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి క్రీడల నిర్వహణ చేపట్టింది. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో 15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పాల్గొనేలా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది.

ఐదు రకాల క్రీడాంశాల్లో పోటీలు

ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాల్లో క్రికెట్, ఖోఖో, షటిల్ బాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. ఆయా క్రీడల్లో ఆసక్తి కలిగినవారిని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరడంతో జిల్లా వ్యాప్తంగా 1,71,975 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకోగా క్రీడలను తిలకించడానికి సుమారు 10.50 లక్షల మంది క్రీడాభిమానులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

ఈ నెల 26 నుంచి పోటీలు ప్రారంభం

ఈ నెల 15 నుంచి ప్రారంభం కావల్సిన క్రీడాపోటీలు ఇటీవల సంభవించిన తుపాను కారణంగా ఈ నెల 26కి వాయిదా వేశారు. సచివాలయం, మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందచేయనున్నారు. 535 సచివాలయాల పరిధిలో 223 క్రీడాస్థలాలను ఎంపిక చేసి పోటీలు నిర్వహించడానికి ప్రభుత్వ, ప్రవేటు విద్యా సంస్థలకు చెందిన 230 మంది పీఈటీ, పీడీలను నియమించారు.

సమన్వయంతో క్రీడల నిర్వహణ

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు జిల్లాలోని పౌర సరఫరాలు, రవాణా, రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, మండల పరిషత్ అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

17 వరకూ రిజిస్ట్రేషన్లు



ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు ఏర్పాట్లు దాదాపు పూర్తికావచ్చాయి. ఈ నెల 15న ప్రారంభం కావాల్సిన పోటీలు 26న ప్రారంభమవుతాయి. దీనికిగాను ఈనెల 17 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు, క్రీడాభిమానులు రిజిస్ట్రేషన్స్ చేయించుకోవచ్చు.

– ఎం.దుర్గారావు, జిల్లా చీఫ్ కోచ్, భీమవరం

భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్ష



సమీక్షలో కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్

భీమవరం(ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లతో వెలగపూడి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, ఉద్యాన, గృహ నిర్మాణం, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొని జిల్లాలో తుపాను పరిస్థితి, పంట నష్టం, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. తుపాను ప్రభావానికి జిల్లాలో జరిగిన పంటలకు నష్టం ప్రాథమిక అంచనాలను రూపొందించామన్నారు. కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి పంట నష్టం పరిశీలిస్తుందన్నారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులు మళ్లీ విత్తనాలు వేసుకోవడానికి అవసరమైన అంచనాలను రూపొందించినట్లు తెలిపారు. మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పురోగతిపై వివరించారు. జిల్లాకు కేటాయించిన జన ఔషధి కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ఫార్మసిస్టులను గుర్తించామని డిసెంబర్‌లో ప్రారంభించేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు సీఎస్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఏ.దుర్గేష్, తదితరులు ఉన్నారు.

కొత్త గోడౌన్‌కు ఈవీఎంల తరలింపు



ఈవీఎంలు తరలిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పీపీ రోడ్ లోని ఏపీఎస్‌డబ్ల్యూసీలోని ఒకటో నెంబర్ గోడౌన్‌లో భద్రపరిచిన ఎన్నికల సామగ్రిని అదే ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గోడౌన్ నెం.7 లోకి గురువారం వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో తరలించారు. తొలుత బెంగళూరు నుంచి వచ్చిన ఈవీఎంలను గోడౌన్ 1 లో భద్రపరిచి అనంతరం బెల్ ఇంజినీర్లతో ఈవీఎం మిషన్ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తి చేశారు. అధునాతన సౌకర్యాలతో పకడ్బందీగా నిర్మించిన గోడౌన్ నెంబర్-7 విశాలవంతంగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండడం వల్ల ఎన్నికల సామగ్రిని శాశ్వత ప్రాతిపదికన అక్కడకు తరలించారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.శ్రీమన్నారాయణ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ విజిలెన్స్ దాడులు.. రూ.5.40 లక్షల జరిమానా



నూజివీడులో దాడుల వివరాలను తెలుపుతున్న అధికారులు

నూజివీడు: ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని నూజివీడు మండలం మీర్జాపురం సెక్షన్ పరిధిలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం విజిలెన్స్ దాడులను నిర్వహించారు. గృహ వినియోగదారుల సర్వీసులను, వాణిజ్య సముదాయ సర్వీసులను విద్యుత్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఈఈ కే వెంకటేశ్వర్లు, ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఏ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది 43 బృందాలుగా ఏర్పడి 2,762 గృహ సర్వీసులను, 189 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారు. వాటిలో అదనపు లోడు వినియోగిస్తున్న 145 సర్వీసుల యజమానులకు రూ.5.40 లక్షల జరిమానా విధించారు. అలాగే అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఐదు సరీస్వులకు రూ.20 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఈఈ సత్యన్నారాయణ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లయితే 83310 20538, 94931 74284 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఈ దాడుల్లో నూజివీడు పట్టణ డీఈ ఓలేటి దుర్గారావు, రూరల్ డీఈ పోతురాజు, తిరువూరు, విస్సన్నపేట డీఈలు రామకృష్ణ, నారాయణ, మీర్జాపురం ఏఈ కే బాబూరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పంట నష్టం సర్వే

- పశ్చిమగోదావరి జిల్లాలో ఇప్పటికే 50 శాతం పూర్తి
- 18వ తేదీతో పూర్తి కానున్న సర్వే, అంచనాలు సిద్ధం
- 22న ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో వివరాలు

సాక్షి, భీమవరం: తుపాను కారణంగా వాటిల్లిన పంట నష్టం అంచనా వేసేందుకు చేపట్టిన సర్వే జిల్లాలో ముమ్మరంగా జరుగుతోంది. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు ఇప్పటికే 50 శాతం మేర సర్వే పూర్తి చేశాయి. ఖరీఫ్ చివరిలో విరుచుకుపడిన మిచాంగ్ తుపాను వరి పంటకు తీవ్ర నష్టం కలిగించిన విషయం విదితమే. వ్యవసాయ, ఉద్యాన శాఖల ప్రాథమిక అంచనా మేరకు జిల్లాలోని 30,092 ఎకరాల్లో వరి చేలు నీట మునిగిపోగా, 47,247 ఎకరాల్లో పైరు నేలనంటిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేస్తూ ప్రభుత్వానికి నివేదిక అందించింది. అదేవిధంగా 300 ఎకరాల్లో కూరగాయల పంటలు, 63 ఎకరాల్లో అరటి తోటలు, 260 ఎకరాల్లో కొబ్బరిచెట్లకు, ఐదు ఎకరాల్లోని పూలతోటలకు నష్టం వాటిల్లింది. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా సాయం అందించి ఆదుకునేందుకు క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలను రూపొందించాలని ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు గత నాలుగు రోజులుగా వ్యవసాయ, రెవెన్యూ, పరిపాలనశాఖలకు సంబంధించి గ్రామ స్థాయి నుంచి మండల, డివిజన్ స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు సర్వే నిర్వహిస్తున్నారు. పొలాల్లోకి వెళ్లి 33 శాతానికి పైగా నష్టం వాటిల్లిన రైతులు, పంట వివరాలను నమోదు చేస్తున్నారు.



ఆచంటలో దెబ్బతిన్న ఓ వరి చేనును పరిశీలిస్తున్న జేడీఏ జెడ్.వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు

26న తుది నివేదిక

పంట నష్టం లెక్కింపునకు సంబంధించి జిల్లాలో 50 శాతం సర్వే పూర్తయింది. ప్రత్యేక కమిటీలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పారదర్శకంగా సర్వే చేస్తున్నారు. ఉన్నతాధికారులు జిల్లాలో పర్యటిస్తూ సర్వే తీరును పర్యవేక్షిస్తున్నారన్నారు. నిర్ణీత గడువునాటికి మిగిలిన విస్తీర్ణంలోనూ సర్వే ప్రక్రియ పూర్తి చేయనున్నారు. కాగా ఈనెల 18వ తేదీ వరకు ఫీల్డ్ సర్వే అనంతరం అంచనాలు సిద్ధం చేసి నష్టం వివరాలు రైతులకు తెలిసేలా ఈ నెల 22వ తేదీన ఆర్బీకేల వద్ద అందుబాటులో ఉంచుతారు. దీనిపై రైతుల అభ్యంతరాలను స్వీకరించి ఆ వివరాలను నమోదు చేసుకుంటారు. పరిశీలన అనంతరం తగిన చర్యలు తీసుకుని తుది నివేదికను 26న కలెక్టర్ కార్యాలయంలో అందజేస్తారు.

ఏటా నెల లోపే ఇన్‌పుట్ సబ్సిడీ

విపత్తులతో పంట నష్టపోయిన రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెల రోజులలోపే ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసి అండగా నిలుస్తోంది. హెక్టారుకు రూ.17వేల చొప్పున, ఒక రైతుకు గరిష్ఠంగా ఐదు ఎకరాలు వరకు సబ్సిడీ సాయం అందిస్తోంది. గడిచిన నాలుగేళ్లలో జిల్లాలోని 1,09,556 మంది రైతులకు రూ.78.2 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని అందజేసింది. బీమా పరిహారంగా 1,14,011 మంది రైతులకు రూ.217.64 కోట్లు అందించి ఆదుకుంది.

కేంద్ర బృందం పరిశీలన

భారత ఆహార సంస్థ సాంకేతిక అధికారి వసంత్ నేతృత్వంలోని కేంద్ర బృందం గురువారం జిల్లాలో పర్యటించింది. వ్యవసాయశాఖ జేడీ జెడ్.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ డీఎం టి.శివరామప్రసాద్‌లతో కలిసి ఆకివీడు, పాలకోడేరు, వీరవాసరం, ఉండి, కాళ్ల తదితర మండలాల్లో పొలాలను పరిశీలించి నష్టం తీవ్రతను లెక్కించేందుకు 17 ధాన్యం శాంపిల్స్‌ను సేకరించింది. బృందంలోని అధికారులు రైతులతో మాట్లాడి పంటనష్టం వివరాలను నమోదు చేసుకున్నారు. వివరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్టు సాంకేతిక అధికారి వసంత్ తెలిపారు.



కైకరంలో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందంలోని అధికారులు

ధాన్యం నమూనాల సేకరణ

ఉంగుటూరు: తుపాను కారణంగా దెబ్బతిన్న ధాన్యాన్ని కేంద్ర బృందం సభ్యులు గురువారం ఉంగుటూరు మండలం కైకరంలో పరిశీలించారు. రాశుల నుంచి ధాన్యం నమూనాలను సేకరించారు. కేంద్రం బృందంలోని ఐజీఎంఆర్ఐ సాంకేతిక అధికారి డాక్టర్ బాసంత, ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ టి.వెంకట సారథి ఉండగా, ఏలూరు జేడీఏ వై.రామకృష్ణ, భీమడోలు ఏడీఏ రాజకుమారి, సివిల్ సప్లైడీఎం మంజు భార్గవి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవల్లో పశ్చిమకు ప్రథమ స్థానం



మాట్లాడుతున్న జిల్లా కార్గో మేనేజర్ జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ కార్గో సేవల్లో పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్గో మేనేజర్ జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు వెల్లడించారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, కస్టమర్లు, సిబ్బంది సహాయ సహకారాలతో కార్గో సేవల్లో రాష్ట్రంలో ముందంజలో ఉన్నామన్నారు. సురక్షితంగా, తక్కువ సమయంలో ఎక్కువ డోర్ డెలివరీలు చేస్తున్నారంటూ కస్టమర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం డోర్ డెలివరీ కేంద్రాలను మరింత పెంచుతున్నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం, పరిసర గ్రామాల వినియోగదారులందరూ కార్గో సేవలను, డోర్ డెలివరీ సౌకర్యం వినియోగించుకోవాలని, తక్కువ చార్జీలతో సకాలంలో సురక్షితంగా పార్శిల్‌ను డెలివరీ చేస్తున్నామన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ఏడీఎల్ సుధారాణి, డీఎంఈ మాధవరావు, పీఆర్‌ఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ వాలీబాల్ జట్టు ఎంపిక



ఆర్జీయూకేటీ వాలీబాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నూజివీడు: బెంగళూరులో ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్వహించే ఇంటర్ వర్సిటీ వాలీబాల్ పోటీల్లో పాల్గొనే ఆర్జీయూకేటీ జట్టును గురువారం ఎంపిక చేశారు. నూజివీడులోని శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్-3లో నాలుగు ట్రిపుల్‌ఐటీల నుంచి హాజరైన క్రీడాకారుల్లో ప్రతిభ చూపిన వారిని జట్టుకు ఎంపిక చేశారు. క్యాంపస్ ఇన్‌చార్జి రియాజ్ హుస్సేన్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మెరుగ్గా ఆడి ఆర్జీయూకేటీ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. జట్టుకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు, హెచ్‌వోడీలు అభినందించారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలి

భీమవరం: ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికుల రక్షణ కోసం ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్ల పూర్తి వివరాలను అందులో పొందుపర్చాలని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. గురువారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఆటో కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా క్రమశిక్షణతో లైసెన్సులు కలిగి నిబంధనలను పాటించాలన్నారు. ఆటోలకు ఏర్పాటు చేస్తున్న క్యూఆర్ కోడ్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్, వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను, ట్రాఫిక్ సీఐ దాస్, ఎస్సై వి.నాగలక్ష్మి, జిల్లా ఆటో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ, పంపన గోపీ పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం

తణుకు: అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి పట్టణంలో విక్రయించేందుకు సిద్ధమవుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ ఎం.నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సజ్జాపురం జాయ తీరహదారి అనుకుని గోస్తనీ కాల్వగట్టు వద్ద నలుగురు వ్యక్తులు గంజాయి కలిగి ఉన్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. భీమవరం పట్టణానికి చెందిన షేక్ వినోద్, నైనపు యర్రంనాయుడు, కంటా సాయిబాబు, పాలకొల్లుకు చెందిన కోనాల సుధీర్ బ్యాగుల్లో మొత్తం 21 కిలోల గంజాయిని తీసుకువచ్చారు. వీరిని అదుపులోకి తీసుకున్న నిందితులపై కేసు నమోదు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.80 వేలు ఉంటుందని సీఐ వెల్లడించారు. గురువారం నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.



తణుకులో గంజాయితో పట్టుబడిన నిందితులు

నలుగురి అరెస్టు.. చోరీ సొత్తు స్వాధీనం

పెనుగొండ: ఆచంట పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రూ.3లక్షలు విలువైన చోరీ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు నరసాపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ జీవీ పైడేశ్వరరావు చెప్పారు. గురువారం ఆచంట పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఆచంట పెదపేటకు చెందిన పానుకు నరేష్‌బాబు, పెనుమంచిలి గ్రామానికి చెందిన కవురు రవితేజ, మరో ఇద్దరు గత కొంత కాలంగా వ్యసనాలకు బానిసలై రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. గురువారం సమాచారం అందడంతో ఆచంట ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో కలసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. వీరి నుంచి రూ.3 లక్షల విలువైన 35 బ్యాటరీలు, మూడు పంపు మోటార్లు, ఆరు ఏసీ ఔట్ యూనిట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగలను పట్టుకున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



చోరీకి గురైన సామగ్రి చూపుతున్న పోలీసులు



గడపగడపకు సంక్షేమం

యలమంచిలి: అబ్బిరాజుపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

వాహనాల బ్యాటరీ దొంగలు అరెస్టు

అత్తిలి : వాహనాల బ్యాటరీలను దొంగిలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం డీఎస్పీ సి శరత్‌రాజ్‌కుమార్ చెప్పారు. గురువారం అత్తిలి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. అత్తిలి రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అత్తిలి, గణపవరం, పెంటపాడు మండలాలకు చెందిన బయ్యేరమణ, ఎల్.భరణి, గంటాప్రకాష్, రాజాన వెంకటశివసాయి, తోట అశోక్‌బాబులను అదుపులోకి తీసుకుని విచారించగా వాహనాలు బ్యాటరీలకు చోరీ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరు అత్తిలి, ఇరగవరం, తణుకు స్టేషన్ల పరిధిలో ట్రాక్టర్, లారీలు, వరికోత యంత్రాలకు చెందిన బ్యాటరీలు దొంగిలించి వాటిని విక్రయించడం ద్వారా వచ్చే డబ్బుతో జల్సాలకు అలవాటుపడ్డారని చెప్పారు. వీరు మోటారు సైకిళ్లు, కారుపై వెళ్లి నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలలో నిలిపి ఉన్న వాహనాల బ్యాటరీలు చోరీకి పాల్పడుతున్నారన్నారు. నిందితుల నుంచి 58 బ్యాటరీలతో పాటు బ్యాటరీ చోరీకి ఉపయోగించే మూడు మోటారు సైకిళ్లను, అద్దెకు తీసుకున్న కారును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ కేసులో రూ.5 లక్షలు విలువ చేసే బ్యాటరీలు, రూ.5 లక్షల విలువగల వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు చెప్పారు. దొంగిలించిన బ్యాటరీలు కొన్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సహకరించిన తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, అత్తిలి ఎస్సై వి.రాంబాబులను అభినందించారు. ఏఎస్సై ఐ వెంకట్రావు, హెచ్‌సీ కృష్ణారావు, ప్రకాష్, రమణ, సత్యనారాయణ, వెంకటకృష్ణ, అప్పారావులకు డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్ నగదు రివార్డులు అందజేశారు.



అత్తిలిలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శరత్‌రాజ్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, రాంబాబు

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజా ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పుణ్యప్రదం.. ధనుర్మాసం

- 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం
- 17 నుంచి శ్రీవారి ఆలయంలో తిరుప్పావై సేవలు
- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన వైష్ణవాలయాలు





ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల: ధనుర్మాసోత్సవాలకు జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబవుతున్నాయి. ధనుర్మాసం విష్ణుమూర్తికి ఎంతో ప్రీతికరమైంది. అన్ని విష్ణు ఆలయాలు, వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో నెల రోజులపాటు తిరుప్పావై పాశురాలను పఠిస్తారు. ఈ మాసంలో విష్ణుమూర్తిని మధుసూదనుడిగా పూజిస్తారు. పెళ్లికాని యువతులు ఇంటి ముందు ముగ్గులు, గొబ్బిళ్లతో పూజలు చేస్తే కోరుకున్న వరుడు దొరుకుతాడని ప్రతీతి. ఈ నెల రోజులూ శ్రీకృష్ణుడికి తులసి మాల సమర్పించే యువతులకు నచ్చిన వరుడితో వివాహం జరుగుతుందని పండితులు చెబుతున్నారు.

నెలరోజులపాటు ఉత్సవాలు

ఈ నెల 16 సాయంత్రం నెలపట్టడంతో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలు జనవరి 14 వరకు జరుగుతాయి. పలువురు భక్తులు ధనుర్మాస వ్రతాలను కూడా ఆచరిస్తారు. ఆలయాల్లో నిత్యం మంగళ వాయిద్యాలు, తిరుప్పావై గానం, ఆండాళ్ కోవెల సేవలను జరుపుతారు. ప్రతి శుక్రవారం గోదాదేవికి కుంకుమార్చన చేస్తారు. ఈ క్రమంలోనే ఈనెల 17 నుంచి నెలరోజుల పాటు ప్రతిరోజూ ఉదయం శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి గ్రామోత్సవాలను నిర్వహిస్తారు. జనవరి 14న భోగి పండుగ నాడు శ్రీవారి కల్యాణంతో పాటు, గోదా రంగనాథుల కల్యాణాన్ని అర్చకులు అట్టహాసంగా జరుపుతారు. ఈ మాసమంతా వైష్ణవ ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది.

ధనుర్మాసం విశిష్టత

ఈ మాసంలో సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించడం వల్ల ధనుర్మాసంగా పేర్కొంటారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేంత వరకు ఉండే పవిత్ర మాసం ఇది. వైష్ణవ సంప్రదాయాల్లో ఈ మాసం అత్యంత పుణ్యదాయకమైంది. ఈ మాసమంతా వైష్ణవాలయాల్లో ప్రతిరోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి విశేష పూజలు నిర్వహిస్తారు. గోదాదేవి తన ఆరాధనను పూలమాలలుగా భావించి రంగనాథునికి సమర్పించి, ఆయనకు ధరింపజేయాల్సిన మాలను తానే ధరించి ఆయన కృపతో మోక్షాన్ని పొందారని పండితులు చెబుతున్నారు. ఆమెనే వైష్ణవ సంప్రదాయంలో ఆండాళ్‌గా వ్యవహరిస్తారు. ఆమె రచించిన తిరుప్పావైలోని 30 పాశురాలను ధనుర్మాసమంతా వైష్ణవాలయాల్లో పారాయణం చేస్తారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో కూడా ఈ నెల రోజులు సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై పఠిస్తారు. సూర్యుడు ఉత్తరాయానికి మారే ముందు వచ్చే పుష్యశుద్ధ ఏకాదశినే వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి అంటారు. వైకుంఠ ఏకాదశి వరకు శ్రీ మహా విష్ణువు యోగ నిద్రలో ఉంటారని, వైకుంఠ ఏకాదశి రోజు మేల్కొని ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తారని పండితులు చెబుతున్నారు. ఆరోజున ప్రభాత వేళలో స్వామి వారిని ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకోవడం ముక్తిదాయకమని చెబుతున్నారు. ఈ మాసమంతా గృహిణులు ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు పెట్టడం సంప్రదాయం.

ఎంతో శుభకరం



భక్తురాలైన గోదాదేవి రంగనాథుడిని స్తుతిస్తూ రోజుకో పాశురాన్ని 30 రోజుల పాటు గానం చేశారు. ఆమె స్వామిలో ఐక్యమవడంతో 30వ రోజున గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణం నిర్వహిస్తారు. పాశురాలు పఠించినా, విన్నా, గోదా కల్యాణం తిలకించినా శుభాలు కలుగుతాయి. 12 మాసాలలో ధనుర్మాసాన్ని వైష్ణవులు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు.

– సుదర్శనం శ్రీనివాసాచార్యులు, ఆగమ పండితులు

క్లుప్తంగా

దేవుని ప్రేమ ఎంతో గొప్పది



నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెంటపాడు: దేవుని ప్రేమ ఎంతో గొప్పదని కె. పెంటపాడు ఎంపీటీసీ సభ్యులు పాట్ల ఏడుకొండలు పేర్కొన్నారు. గురువారం కె. పెంటపాడు కల్వరి మహిమ స్వస్థతశాల అధ్యక్షురాలు పాట్ల స్వాతి ఆధ్వర్యంలో చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ దేవుని హృదయపూర్వకంగా ఆరాధించే వారికి ఆయన దీవెనలు మెండుగా ఉంటాయన్నారు. గూడెం బైబిలు కళాశాల డైరెక్టర్ రొక్కాల నాగ బుజ్జి, రిజిస్ట్రార్ ఆశీర్వాదంలు మట్లాడుతూ దేవుని యందు భయభక్తులతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు పాట్ల ఏడుకొండలు ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మద్దుకూరి రోజా, స్థానిక సంఘ విశ్వాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



గణేష్ నగర్‌లోని కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పెంటపాడు: పట్టణంలోని గణేష్‌నగర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఎఫ్‌సీఐ కాలనీ రెసిడెంట్ అసోషియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం భారీగా సామూహిక సత్యవ్రతాలు ఘనంగా జరిగాయి. పలుజంటలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎఫ్‌సీఐ రెసిడెంట్‌వేల్ఫేర్ అసోషియేషన్ కోశాధికారి పూతినీడి పరమాత్మ, సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పోటీలు

తణుకు: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని తణుకు విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఏడీఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 15న ఇంధన పొదుపుపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 16న చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేసినట్లు ఇందులో పాల్గొనే విద్యార్థులు ఉదయం 10 గంటలకు కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

పుంతలో ముసలమ్మ 41వ మహోత్సవాలు ప్రారంభం



సీతారాంపేటలో పుంతలో ముసలమ్మ ఉత్సవాల ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: స్థానిక యువ ఫ్రెండ్స్ సర్కిల్ గౌరవాధ్యక్షుడు రాజా త్రినాథ్ ఆధ్వర్యంలో పుంతలో ముసలమ్మ అమ్మవారి 41వ వార్షికోత్సవ మహోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం రాటను ఏర్పాటు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజా త్రినాథ్ మాట్లాడుతూ పుంతలో ముసలమ్మ అమ్మవారి మహోత్సవాలను గత 40 ఏళ్ల నుంచి నిర్విరామంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలను 2024 నూతన సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 10వతేదీన అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. రాట ఏర్పాట పూజలో వెలనాటి సత్తిబాబు, సూరపరెడ్డి బాబు, ఆలపాటి వెంకటేశ్వరరావు, కర్రి లోవ, నేమని మల్లి, నున్న వెంకటేశ్వరరావు, పులి రామారావు, పత్యాల భాస్కరావు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చడంతోపాటు క్రమశిక్షణగా సేవలందించడం అభినందనీయమని జిల్లా ప్రజారవాణాధికారి ఎ.వీరయ్యచౌదరి అన్నారు. తణుకు డిపోలో గురువారం నవంబరు నెలలో అత్యుత్తమ సేవలందించిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల ప్రయాణానికి అధికంగా ప్రయాణికులు ఇష్టపడుతున్నారని స్పష్టం చేశారు. అనంతరం డ్రైవర్లు ఎం.భూపాల్, పి.రాజాబాబు, యూసీహెచ్ గంగరాజు, కండక్టర్‌లు ఎ.ప్రసాద్, ఎం.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావులను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్, ట్రాఫిక్ ఇనస్పెక్టర్ బీవీకే రావు, గ్యారేజి ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ కేజీహెచ్ఎస్ శేఖర్, ఎస్‌డీఐ కళ్యాణరాజు, గ్యారేజ్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్‌లు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం

- విద్య, వైద్యానికి సీఎం జగన్ ప్రాధాన్యం
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 24, 25 వార్డులకు సంబంధించి గురువారం రోటరీ క్లబ్ ఆవరణలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదవర్గాలందరికీ జగనన్న అందిస్తున్న సంక్షేమం పారదర్శకంగా అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. నవరత్నాల్లో ముఖ్యంగా విద్య, వైద్యం, ఉద్యోగాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు. ముఖ్యంగా నాడు నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులందరూ ఆంగ్లంలో మాట్లాడేలా చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అదే ప్రతిభతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అమెరికా వరకు వెళ్లి తమ ప్రతిభాపాటవాలను చూపించారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందిన తీరును ప్రపంచ వ్యాప్తంగా అభినందనలు వ్యక్తమవుతుండడం గర్వంగా ఉందన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద వంటి పథకాలు పేదలందరికీ అందాలంటే ప్రజనీకమంతా మీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దోచుకో దాచుకో అనే రీతిలో ప్రజా ధనాన్ని దోచుకున్నాడు కాబట్టే జైలుకెళ్లి ఊచలు లెక్కించాడని మంత్రి కారుమూరి దుయ్యబట్టారు. జగన్ డబ్బులు పంచిపెట్టి ప్రజలను సోమరిపోతుల్లా చేసేస్తున్నాడని ఏపీ మరో శ్రీలంకగా మారిపోతుందని విమర్శించిన చంద్రబాబు ఆయన దత్త పుత్రుడు పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు మాట మార్చి జగనన్న ఇచ్చే పథకాలను మేము కూడా ఇస్తానని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రెండు వార్డుల సంక్షేమ పట్టికలతో పాటు అమరవీరుల ఉద్యానవనం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజానీకానికి సంక్షేమ బ్రోచర్‌లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు షహీమా, పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు పిల్లి సూరిబాబు, 24వార్డు నాయకులు బండి సతీష్, వడ్లమాని పార్వతి, గంటా ప్రసాద్, 25వ వార్డు నాయకులు రేలంగి రాంబాబు, ఎస్‌ఏకే జిలాని, పైడి పద్మ, చేకూరి మధు, ములగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయ్

ఇరగవరం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపిస్తాయని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు తెలిపారు. మండలంలోని సూరంపూడి గ్రామ సచివాలయ పరిధిలో గురువారం సర్పంచ్ కఠారి చంద్రమణి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సంక్షేమ పథకాల బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా పద్మావతి, ఎంపీడీవో శ్రీనివాస్ ఈవోపీఆర్డీ నరసింహ మూర్తి, అధికారులు, జెసిఎస్ కన్వీనర్ దినేష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు చోడే జోషి, కఠారి రాంబాబు రాజు, బొల్లా సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, నాయకులు, కార్యదర్శి, వి గణేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

తాడేపల్లిగూడెం రూరల్: పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి అవసరమని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని పడాల గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ హెల్త్ క్లీనిక్ సెంటర్లు, జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలు అందించడం జరిగిందన్నారు. వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రైతు నష్టపోతే సకాలంలో ఆదుకున్న ప్రభుత్వాలు లేవన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సకాలంలో పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. అలాగే, ధాన్యం విక్రయించిన ప్రతి రైతుకు వారి బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమ చేశారన్నారు. గతంలో చంద్రబాబు ఏనాడూ ఈ మాదిరిగా చేయలేదన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి సీఎం జగన్ అవసరం ఎంతైనా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలోనూ రాష్ట్ర ప్రజల్ని ఆర్థికంగా ఆదుకున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు రైతులను, మహిళలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో ప్రజల వైపు చూడని నాయకులు నేడు అనేక హామీలు గుప్పిస్తున్నారన్నారు. ప్రజలకు అన్ని విధాల అండగా నిలిచిన జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఎన్నుకోవాలన్నారు. అనంతరం 15కోట్ల 92లక్షల 71వేల 525 రూపాయలు విలువైన సంక్షేమ పథకాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి కే.శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, నాయకులు పులి గోపాలకృష్ణ, లింగంపల్లి వేమన, విప్పర్తి ఆనందరావు, పులి ప్రసాద్ (దత్తుడిగారి అబ్బాయి), పులి భోగేశ్వరరావు, పచ్చా రామకృష్ణ, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని స్థానిక 20వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, 1వ పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు, 20వార్డు ఇన్‌ఛార్జి రాజా త్రినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో ప్రతిఇంటికీ లబ్ధి చేకూరిందని తెలిపారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమపథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయా లని కోరారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ నియోజకవర్గాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వెలనాటి సత్తిబాబు, సింగం సుబ్బారావు, చామన సూర్యచంద్రరావు, బొద్దాని శ్రీనివాస్, పటానల గణపతి, ప్రసాద్, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, తాడపర్తి రజని, అవిరెడ్డి లక్ష్మీనారాయణ, మారిశెట్టి వెంకటరమణ తదితర నాయకులు పాల్గొన్నారు.



ఇరగవరం: సూరంపూడిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తణుకు అర్బన్: 20వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న రాజా త్రినాథ్



తాడేపల్లిగూడెం రూరల్: పడాల పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

విశ్వాసులంతా క్రీస్తు మార్గాన్ని ఆచరించాలి



తణుకులో టీసీవై క్రిస్మస్ వేడుకల్లో క్యాండిల్స్‌తో మంత్రి కారుమూరి, ప్రసంగీకులు లాజరస్

తణుకు అర్బన్: పొరుగువారిని ప్రేమించమనే యేసుక్రీస్తు మార్గాన్ని విశ్వాసులంతా ఆచరించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం రాత్రి నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తణుకు క్రిస్టియన్ యూత్ (టీసీవై) 24వ వార్షిక యూత్ క్రిస్మస్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ 24 సంవత్సరాలుగా టీసీవై ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఎంతో వేడుకగా ఈ క్రిస్మస్ నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది నిర్వహించే సిల్వర్ జూబ్లీ సావనీరును మంత్రి కారుమూరి చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం క్రిస్మస్ కేకు కట్ చేసి క్యాండిల్స్ వెలిగించారు. ముందుగా బిషప్ పి.నటరాజన్ లాజరస్ బైబిల్ ప్రసంగం విశ్వాసులను ఆకట్టుకోగా, అంతర్జాతీయ సువార్త గాయకులు డాక్టర్ ఏఆర్ స్టీవెన్‌సన్ దైవగీతాలతో ఆద్యంతం అలరించారు. టీసీవై కన్వీనర్ మురాల సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రిస్మస్ వేడుకల్లో ఫాస్టర్స్ మనోజ్, కేఎస్ రాజు, జాషువా, డేవిడ్ బాబు, కృపావరం, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, షహీమా తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై అంగన్‌వాడీల నిరసన



తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



తణుకులో మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

తాడేపల్లిగూడెం రూరల్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె గురువారం మూడవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ గతంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తెలంగాణా కంటే అదనంగా జీతాలు చెల్లించాలన్నారు. చాలీచాలని జీతాలతో కాలం వెళ్ల దీయడం గగనంగా ఉందన్నారు. జగనన్న తమ పట్ల సహృదయంతో జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూపారాణి, ప్రభారాణి, డి.దుర్గ, డి.వరలక్ష్మి, వి.కనకలక్ష్మి, ప్రసన్న, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఐటీయు నాయకులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు పతివాడ నాగేంద్రబాబులు అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు.

తణుకు: తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తణుకులో అంగన్‌వాడీలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. స్థానిక కోర్టు సమీపంలో చేపట్టిన ఈ రిలే దీక్షలకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ సంఘీబావం తెలియజేసి మాట్లాడారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలు పగలగొట్టడం సరికాదన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గార రంగారావు, ఆంజనేయులు, జీఎం రాజకుమారి, కె.నళినిరాణి, జ్యోతి, కనకదుర్గ, వసంతకుమారి, ప్రమీల, మణిమాలతి, సాయికుమారి తదితరులు ఆధ్వర్యం వహించారు.

పూర్వ విద్యార్థుల సేవలు మరువలేనివి



పూర్వ విద్యార్థులను అభినందిస్తున్న యువనేత కొట్టు విశాల్

పెంటపాడు: విద్యాలయాలను దేవాలయాలుగా భావించి కళాశాల అభివృద్ధికి పాటు పడుతున్న పూర్వ విద్యార్థుల సేవలు మరువలేనివని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. గురువారం పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరస్వతి విగ్రహానికి ఆలయం నిర్మించి టైల్స్ వేయించిన 1985–89 బీకాం బ్యాచ్ విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రారంభించి ప్రత్యేక పూజలు చేసారు. దాత వాకచర్ల కాంతారావు తదితరులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన కళాశాల ఉన్నతిని ప్రతి వ్యక్తి కోరుకోవాలన్నారు. కళాశాలకు నాక్ గుర్తింపు త్వరితగతిన వచ్చేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయానందరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కర్రి వరహాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం యాగర్లపల్లి, వీకర్స్‌కాలనీ పరిధిలోని 3,4,7,20,21,22,23 వార్డులలో ఫీవర్ సర్వేలు నిర్వహించారు. కీటక జనిత వ్యాధులపై గురువారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ తప్పనిసరిగా దోమ తెరలు వాడాలన్నారు. మంగతాయారు, సరళ, వెంకటలక్ష్మి, రజనీ, సరస్వతి, మేరీ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, రామకృష్ణ, ఆశాలు, వార్డు వలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

17న పెన్షనర్స్ జాతీయ పండుగను విజయవంతం చేద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఈనెల 17వ తేదీన ఆల్ ఇండియా పెన్షనర్స్ డే సందర్భంగా నిర్వహించే జాతీయ పండుగను విజయవంతం చేద్దామని పెన్షనర్స్ సంఘం యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గరికపాటి సుబ్రహ్మణ్య శర్మలు తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్లు మాట్లాడుతూ ఆల్ ఇండియా పెన్షనర్స్ డే సందర్భంగా ఆదివారం ఉదయం ఫాదర్ ఆఫ్ పెన్షనర్స్ డీఎస్ నకారా చేసిన సేవలను స్మరిస్తూ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

తపాలా సిబ్బంది ఆందోళన



తణుకు హెడ్ పోస్టాఫీసు వద్ద సమ్మెలో పాల్గొన్న జేఏసీ నాయకులు



గూడెంలో ర్యాలీ చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

తణుకు అర్బన్: తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ తణుకు బ్రాంచ్ అధ్యక్షుడు మండెల సత్యనారాయణ, కార్యదర్శి డి.బ్రెన్‌హామ్‌లు విమర్శించారు. స్థానిక తపాలా కార్యాలయం వద్ద బుధవారం ఉద్యోగులు నిరసన చేపట్టారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన సూచనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక తపాలా కార్యాలయం వద్ద డాక్ సేవకులు చేస్తున్న సమ్మె గురువారం కూడా కొనసాగింది. కమలేష్ కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని తాడేపల్లిగూడెం డివిజన్ యూనియన్ అధ్యక్షులు కె.రవీంద్ర, సెక్రటరీ ఎస్.రమేష్ లు కోరారు. గ్రామాల్లో పనిచేసే సిబ్బంది 8గంటల పనిభారం కల్పించాలని కోరారు. అలాగే డాక్ సేవకులకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూజీడీఎస్‌యూ సెక్రటరీ సాయిబాబు, అధ్యక్షులు గంగాజలం, ఎన్ఎఫ్‌పీఈ నాయకులు అబ్దుల్ రెహ్మాన్, వెంకన్నబాబు, డివిజన్‌లోని యూనియన్ పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హౌసింగ్‌బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొండయ్య చెరువు, రైల్వే, మెయిన్ రోడ్డు ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గురువారం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. రైల్వే స్టేషన్ రోడ్డు, వెంకటరత్నం ఆసుపత్రి ఏరియా, భూపాల్‌నగర్, జూబ్లీ రోడ్డు, మెయిన్‌రోడ్డు, నందిబొమ్మ సెంటర్, బస్ స్టాండ్, తాలూకా ఆఫీస్ సెంటర్, మునిసిపల్ ఆఫీస్, కడకట్ల కొండయ్య చెరువు, ఉమన్స్ కళాశాల, మసీద్ సెంటర్, రాకెట్ పార్కు, ఝాన్సీరాణి ఆసుపత్రి, పీఅండ్‌టీ కాలనీ తదితర ఏరియాలలో విద్యుత్ ఉండదని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే టూ టౌన్ సౌత్ ఎస్ఎస్ పెంటపాడు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

తణుకు విద్యార్థినుల ప్రతిభ

తణుకు టౌన్: ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ మహిళా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తణుకు మహిళా కళాశాల విద్యార్థినులు పలు విభాగాల్లో పాల్గొని బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె రామకృష్ణ తెలిపారు. ఈనెల 12, 13 తేదీల్లో రాజమండ్రిలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన యూనివర్సిటీ స్థాయి మహిళా అథ్లెటిక్స్ పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన యూఎన్‌డీ భవానీ హై జంప్‌లో ప్రథమ, పీ రమ్య జావలిన్ త్రోలో ద్వితీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, పీడీలు ఎం రత్నకుమారి, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత



తణుకులో ఇంజనీరింగ్ విద్యార్థికి చెక్కును అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థికి కళాశాల ఫీజు నిమిత్తం మానవత సంస్థ రూ. 22,500 ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు అక్కాపంతుల బాలాజీ తెలిపారు. గురువారం తణుకు గమిని ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న తణుకు పట్టణానికి చెందిన ఆదిమూల కళ్యాణ్ చరణ్ దుర్గకు మానవత సంస్థ సభ్యులు సంస్థ నుంచి రూ. 15 వేలు, మానవత మండల కన్వీనర్ ఆనందం మస్తాన్‌రావు వ్యక్తిగతంగా రూ. 7,500 మొత్తం రూ. 22, 500ల చెక్కును విద్యార్థికి అందజేశారు. ఈకార్యక్రమంలో మానవత కార్యదర్శి ఆలపాటి సోమేశ్వరరావు, రీజియన్ కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, ఆలపాటి సుబ్బారావు, కేవీ రమణమూర్తి, కొల్లేపర సత్యనారాయణ, బీ రామకాశీ, పీ పరామకృష్ణంరాజు, బావిశెట్టి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.